క్లుప్తంగా

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న సభ్యులు

మొగుళ్లపల్లి: మండలంలోని మేదరమెట్లలోని నిరుపేద వృద్ధురాలికి గురువారం విజ్ఞాన భారతి గ్రామ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఇందిరా మహిళ శక్తి సంబురాల్లో భాగంగా 45 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు శైలజ, వీఓఏ పావని, సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాలలోని మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు గంటల ప్రాతిపదికనా పీజీటీ కెమిస్ట్రీ బోధించుటకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఎడ్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని అదే రోజు ఉదయం 10 గంటల నుంచి డెమోక్లాస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు వాహనాల వేలం

కాటారం: ఎక్సైజ్ శాఖ కాటారం సర్కిల్ ఆధ్వర్యంలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు(శుక్రవారం) ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు ఎస్సై కిష్టయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు డిపాజిట్‌గా 50 శాతం సొమ్మును ముందస్తుగా చెల్లించి మిగిలిన సొమ్మును వాహనం పొందిన తర్వాత అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తుక్కు వాహనాలను వేలంలో దక్కించుకున్న వారు కట్ చేసి మాత్రమే తీసుకోవాలని వాహనం తీసుకున్న వారు జీఎస్టీ కూడా చెల్లించాలని వివరించారు. ఆసక్తి గల వారు ఉదయం 11 గంటలకు వేలంలో పాల్గొనాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



అభినందిస్తున్న చైర్మన్ కరుణాకర్‌రావు

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో చదువుతున్న రణవేని దీక్షిత్‌కుమార్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీల్లో రాణించిన దీక్షిత్‌కుమార్ హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలలో సీటు సాధించాడు. ఎంపికైనా విద్యార్థిని పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు గురువారం అభినందించారు. ప్రతీ సంవత్సరం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు సీటు సాధించడం గర్వకారణం అన్నారు.

నిలిచిన నిర్మాణాలు



పిల్లర్ల దశలో నిలిచిన తాడిచర్ల-1 సబ్‌సెంటర్



అసంపూర్తిగా ఉన్న డాక్టర్ రెసిడెన్షియల్ క్వార్టర్

- నిధులు లేక అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మల్హర్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అనారోగ్య సమస్యలను తీర్చడంతో పాటు పిల్లలకు వివిధ రకాల వ్యాక్సిన్లని వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్లలలో ఇస్తూ ఉంటారు. అలాంటి ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణాలు నిధుల లేమితో అర్ధాంతరంగా నిలిచి పోయాయి. మండలంలో ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా రుద్రారం, అన్సాన్‌పల్లి, పెద్దతూండ్ల గ్రామాల్లో సబ్ సెంటర్లకు సొంత భవనాలు ఉన్నాయి. వల్లెకుంట, ఎడ్లపల్లి, మల్లారం గ్రామాల్లో సెంటర్లు గ్రామ పంచాయతీ భవనాల్లో కొనసాగుతున్నాయి. అలాగే తాడిచర్ల-1, తాడిచర్ల-2 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. తాడిచర్ల-1 సెంటర్, మల్లారం సబ్‌సెంటర్ల నిర్మాణాలకు ఎన్‌హెచ్ఎం ద్వారా ఒక్కొక్క సెంటర్‌కు రూ.20 లక్షలు, తాడిచర్ల ప్రాథమిక కేంద్రంలో వైద్యాధికారి రెసిడెన్షియల్ క్వాటర్ భవనానికి రూ.19.50 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో గత సంవత్సరం మార్చిలో అధికారులు శంకుస్థాపన చేశారు. తాడిచర్ల సబ్ సెంటర్-1 బెస్‌మెంట్ వరకు, క్వార్టర్ స్లాబ్ వరకు నిర్మాణాలు చేపట్టారు. మల్లారంలో సబ్ సెంటర్ నిర్మాణం మాత్రం శంకుస్థాపనకే పరిమితమైంది. దీంతో గ్రామంలో వైద్య సేవలు అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి



తాడిచర్ల, మల్లారం సబ్ సెంటర్, డాక్టర్ క్వార్టర్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి. తాడిచర్ల , మల్లారంలో సబ్ సెంటర్లు లేకపోవడంతో గ్రామస్తులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ప్రభుత్వం నిధులు కేటాయించి పెండింగ్ పనులు పూర్తి చేయాలి.

– కుమారస్వామి, సీపీఐ మండల కార్యదర్శి

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



రేగొండ: ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల/టేకుమట్ల/మొగుళ్లపల్లి/రేగొండ: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం చిట్యాల మండలంలోని చల్లగరిగలోని శ్రీ అయోధ్య రామాలయంలో, ముచినిపర్తిలోని శ్రీహనుమాన్ ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అలాగే టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం, పెద్దమ్మ ఆలయం , ఆకినపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తపల్లి గోరిలో బీరన్న ఆలయం, రేగొండలోని రావులపల్లిలో పోచమ్మ ఆలయాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి గొప్ప కార్యాచరణతో ముందుకు సాగుతున్నాడని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాలను పట్టించుకోలేదని ఆరోపించారు. నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. చిట్యాలలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, ఎంపీఓ రామకృష్ణ, టేకుమట్లలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, నాయకులు నాంపెల్లి వీరేశం, శాస్త్రాల కిరణ్, తోడేటి కుమార్, చిరంజీవి, మొగుళ్లపల్లిలో తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ సత్యనారాయణ, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, నాయకులు తక్కళ్లపెల్లి రాజు, కుమారస్వామి,శివారెడ్డి, రాము, లింగారావు, రేగొండలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, నాయకులు పున్నం రవి, ఓం ప్రకాశ్, వీరబ్రహ్మం, సుదర్శన్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని బొమ్మాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కుదురుపల్లి నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను నిలిపి తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా తరలిస్తున్నారని గుర్తించి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

వాజేడు: మండలంలో రైతులకు అందుబాటులో యూరియా ఉందని మండల వ్యవసాయాధికారి ముంజ మహేశ్ తెలిపారు. మండలంలోని సొసైటీ, అగ్రోస్, శ్రీరామ ఫర్టిలైజర్లలో ఎరువులను గురువారం పరిశీలించి శాంపిళ్లను పరీక్షల కోసం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 130 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. రైతులు అవసరం మేరకు కొనుగోలు చేసుకోవాలని కోరారు. యూరియా కొరత ఉన్నట్లు కొందరు కావాలనే వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారని అలాంటి వారి వదంతులను నమ్మొద్దని అన్నారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డుకు బస్‌షెల్టర్ నిర్మించాలని గురువారం జాతీయ మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షుడు వీరమల్లు రాము కలెక్టర్‌ను కోరారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి నిత్యం వచ్చి వెళ్లే ప్రయాణికులకు నిలువ నీడ లేకుండ పోయిందని అన్నారు. కూర్చోడానికి సరైన సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల కోసం ఆటోల కోసం వేచి ఉండే ప్రజలకు సదుపాయాలు లేవని అన్నారు. బండారుపల్లి రోడ్డులో బస్‌షెల్టర్ నిర్మించి ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్, కోమల, తదితరులు ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరాలి

ఏటూరునాగారం: కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘంలో అధిక మొత్తంలో సభ్యత్వం తీసుకోవాలని ఏటూరునాగారం పీఏసీఎస్ సీఈఓ గౌరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఈ సంఘంలో చేరి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని ఆరో వార్డుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త జనగాం సంపత్ తల్లి నర్సక్క గురువారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు రూ.15వేలు అందజేశారు. ముమ్మగాని రమేష్, రతన్, శ్రీనివాస్, రాంబాబు, నాగరాజు, రమేష్, యాదగిరి ఉన్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాస్

ఏటూరునాగారం: ఎంపీడీఓగా చిర్రవేణి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. హనుమకొండ జిల్లా నడికుడ ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై ఏటూరునాగారానికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై సాంబమూర్తి

భూపాలపల్లి అర్బన్: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సాంబమూర్తి తెలిపారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అశ్లీల చిత్రాలను ఆన్‌లైన్ చూసిన, వాటికోసం వెతికినా, సోషల్ మీడియా ద్వారా ఇతరులకు పంపినా నేరమన్నారు. ఇలా చేసిన వారి వివరాలను జాతీయ ట్రిప్లిన్ వారు సేకరించి నేరుగా పోలీస్ స్టేషన్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. దాని ఆధారంగా వారిపై కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఓటీపీ ఆధారిత మోసాలు, ఏపీకే యాప్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైన వారు 24గంటలలోపు పోలీస్‌స్టేషన్ లేదా 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోం..

- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్



మాట్లాడుతున్న కొలుగూరి అనిల్‌కుమార్

టేకుమట్ల: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుపై బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, వ్యక్తిగత విమర్శలు మానుకోకుంటే ఊరుకునేది లేదని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొలుగూరి అనిల్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బిక్షతోనే ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్వలాభం కోసం బీఆర్ఎస్‌లో చేరి రాజకీయ జన్మనిచ్చిన పార్టీనే విమర్శించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు అజయ్, విష్ణు, విగ్నేష్, అనిల్, భాస్కర్, రమణ, అనిల్, ఓంకార్, పవన్, తదితరులు ఉన్నారు.

శాశ్వత భవనాలు నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని గురువారం బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. మొట్లపల్లి గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని అందులో రెండు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయని అన్నారు. అధికారులు స్పందించి శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మండల నాయకులు మంద రమేష్, దూడపాక శ్రీ కృష్ణ, జన్నె లక్ష్మణ్, దూడపాక రాజు, బండారి కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేసేలా చర్య తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

వాజేడు: తమ కాలనీ నుంచి బయటకు వెళ్లేందుకు ఉన్న రోడ్డుపై సీసీ రోడ్డు వేసేలా చర్య తీసుకోవాలని గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ ఆధ్వర్యంలో చంద్రుపట్ల గ్రామానికి చెందిన కొందరు ఎస్సీలు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీ నుంచి బయటకు వెళ్లడానికి వీలుగా 1986లో కచ్చ రహదారిని వేశారని తెలిపారు. దానికి ఇప్పుడు సీసీ రోడ్డు మంజూరైనట్లు పేర్కొన్నారు. కాగా ఆ రహదారి వేయకుండా గ్రామానికి చెందిన ఓ రైతు అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. అధికారులు విచారణ చేసి రహదారి వేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు.

కొండాయి బ్రిడ్జి పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్



బ్రిడ్జిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి-దొడ్ల గ్రామాల మధ్యలోని కొండాయి హైలెవల్ బ్రిడ్జిని సకాలంలో పూర్తి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొండాయి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను నాయకులు పరిశీలించారు. గతంలో ఇక్కడ బ్రిడ్జి ఉండగా వరదలకు కొట్టుకపోయిందన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో లోతట్టు గ్రామాలైన మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం ప్రజలు ఈ వాగులో, మట్టిరోడ్లపై కాలం వెళ్లదీయాల్సి వస్తోందన్నారు. సకాలంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. ప్రభుత్వం, మంత్రి నిర్లక్ష్యంతోనే పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. మల్లారెడ్డి, ఖాజాపాషా, తాడూరి, చంద్రబాబు, కాళ్ల రామకృష్ణ, నర్సయ్య, శ్రీనివాస్, ముత్తయ్య, ఎల్లయ్య, శేఖర్, కిషోర్ ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

వెంకటాపురం(కె): రక్తదానం ప్రాణదానంతో సమానం అని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిడెం సాయికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పేరికవీధిలో గురువారం చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేసి పలువురి ప్రాణాలను కాపాడాలని అన్నారు. చిడెం సాయి తేజా, అయ్యప్ప, మహేష్, తదితరులు ఉన్నారు.

సాగు భూములకు హక్కు పత్రాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): మాలల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని మాల మహానాడు జిల్లా నాయకుడు సాధనపల్లి చిట్టిబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో సమానంగా జీవిస్తున్న మాలల భూములకు హక్కు పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంచాల భూషణం, సాదనపల్లి పెద్ద శ్రీనివాసరావు, భరత్ కల్యాణ్, లక్కుమల్ల మోహన్, ప్రణీత్, లక్ష్మీ నారాయణ, నారాయణమూర్తి, కాల్వ సుందర్రావ్, మహేష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

నెరవేరుతున్న సొంతింటి కల



రాఘవపట్నంలో స్లాబ్ లెవల్ వరకు పూర్తయిన ఇల్లు



పస్రాలో గోడల వరకు నిర్మాణం పూర్తయిన ఇల్లు

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- సకాలంలో బిల్లుల చెల్లింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

గోవిందరావుపేట: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. బాలాజీ నగర్‌కు 15, బుస్సాపూర్‌కు 9, చల్వాయికి 73, గాంధీనగర్‌కు 5, గోవిందరావుపేటకి 80, కర్లపల్లికి 18, కోటగడ్డకి 6, లక్నవరానికి 31, లక్ష్మీపురానికి 18, మచ్చాపూర్‌కు 7, పాపయ్యపల్లికి 4, పస్రాకి 60, రాంనగర్‌కు 3, సోమలగడ్డకు 5, రాఘవపట్నంకు 98 ఇళ్లు మంజూరయ్యాయి. మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసి ఆన్‌లైన్ చేసుకొని పనులు చేపడుతున్నారు. చాలా చోట్ల గోడల లెవల్ వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి.

నాలుగు సార్లు బిల్లుల చెల్లింపు..

ఇళ్ల నిర్మాణాల్లో బెస్‌మెంట్ వరకు పూర్తి అయ్యాక అధికారులు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తారు. దీంతో రూ.లక్ష నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోంది. రూఫ్‌లెవల్ గోడల వరకు నిర్మాణం పూర్తి చేస్తే మరో రూ.లక్ష, స్లాబ్ పూర్తి అయ్యాక మరో రూ.2లక్షలు, ప్లాస్టరింగ్, కలర్ వాషింగ్ పూర్తయ్యాక చివరి బిల్లు రూ.లక్ష అందిస్తారు.

పైలెట్ ప్రాజెక్ట్‌గా రాఘవపట్నం

మండలంలోని రాఘవపట్నం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఈ గ్రామానికి 98 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 47 ఇళ్లు గోడల లెవల్ నిర్మాణం పూర్తై రూ.2 లక్షల వరకు బిల్లులు పొందారు. మరో 5 ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు పూర్తై రూ.4 లక్షల వరకు బిల్లులు పొందారు. సకాలంలో బిల్లులు పడుతుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిరంతర ప్రక్రియ



ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ. మంత్రి సీతక్కకు పేదల కష్టాలు తెలుసు. అర్హులందరికీ ఇళ్లు వస్తాయి ఎవరూ కూడా తొందర పడొద్దు. త్వరలోనే మళ్లీ రెండో విడత లబ్ధిదారుల లిస్టును ప్రభుత్వం విడుదల చేస్తుంది.

– పైడాకుల అశోక్, డీసీసీ ప్రెసిడెంట్

ఆనందంగా ఉంది



మాకు ఇల్లు లేదని బాధపడేవాళ్లాం. మంత్రి సీతక్క మాకు ఇల్లు ఇచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఇల్లు నిర్మాణం అవుతున్న కొద్ది బిల్లులు పడుతున్నాయి. అధికారులే త్వరగా నిర్మించుకోవాలని పరుగులు పెట్టిస్తున్నారు.

– గగ్గోల రాజమణి, రాఘవపట్నం

ఇల్లు కట్టుకుంటా అనుకోలేదు..



నాకు ముగ్గురు ఆడ పిల్లలు. బతకడానికే మాకు చాలా కష్టంగా ఉండేది. 15 సంవత్సరాల నుంచి పరదాలు కట్టుకొని చిన్నగుడిసెలో నివసిస్తున్నాం. ఇల్లు కట్టుకుంటా అని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ఇప్పుడు నేను ఇల్లు కట్టుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నాకు ఇల్లు ఇచ్చినందుకు మంత్రి సీతక్కకు రుణపడి ఉంటా.

– వాంకుదోతు లత, దుంపెల్లిగూడెం

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సన్మానిస్తున్న ఎస్సైలు

వెంకటాపురం(కె): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సైలు కొప్పుల తిరుపతిరావు , సాయికృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విజన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నవోదయ, బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. చక్కగా చదువుకొని గురువులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.